## క్లుప్తంగా

### సాక్షి గణపతికి విశేషపూజలు



పూజలందుకున్న సాక్షి గణపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతి స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేష పుష్పార్చన జరిపించారు.

### రేపు ఆది శంకర జయంతి



ఆది శంకరుడు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో వైశాఖ శుద్ధ పంచమి సందర్భంగా మే 2న ఆదిశంకరుల జయంతి ఉత్సవం నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ ఎం శ్రీనివాసరావు తెలిపారు. పాలధార -పంచధారల వద్ద ఉన్న శంకరమందిరంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదిశంకరుల వారికి, శ్రీశైల క్షేత్రానికి చాలా దగ్గరి సంబంధం ఉంది. శంకరుల వారు శ్రీశైలంలోని పాలధార -పంచధార వద్ద కొంతకాలం తపస్సు చేసి అక్కడే శివానంద లహరి గ్రంథాన్ని రచించారు. ఈ శివానందలహరిలో శ్రీశైలక్షేత్రాన్ని, భ్రమరాంబా మల్లికార్జునులను స్తుతించారు. అలాగే యోగతారావళి గ్రంథంలో శ్రీశైలంలోనే సమాధిని పొందాలని అభిలషించారని చెబుతోంది.

- రుద్రవనం(రుద్రపార్కు)లోని రుద్రమూర్తికి మే 2న ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ ఎం శ్రీనివాసరావు తెలిపారు.

### నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



బోర్‌లో పడిన రాయిని బోర్ మిషన్‌తో తొలగిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

కొత్తపల్లి: కపిలేశ్వరంలోని నీటి సమస్యపై ఏప్రిల్ 29న సాక్షి దిన పత్రికలో దాహం..దాహం శీర్షికన వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహమ్మద్ జుబేర్, ఎర్రమఠం సర్పంచ్ బాల ఎల్లయ్య బుధవారం గ్రామానికి చేరుకుని పరిశీలించారు. నీటి ఎద్దడికి బోరు బావిలో పెద్ద రాయి పడటమే కారణమని గుర్తించి బోరు మిషన్‌తో తొలగించారు. బోరుకు కొత్త మోటార్ ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరించారు.

### వేసవి తరగతులు సద్వినియోగం చేసుకోవాలి



పిల్లల చేత పంచ తంత్ర కథలను చదివిస్తున్న లైబ్రేరియన్ మద్దమ్మ

పగిద్యాల: స్థానిక గ్రంథాలయంలో బుధవారం నుంచి ప్రారంభించిన వేసవి తరగతులను సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ మద్దమ్మ విద్యార్థులకు సూచించారు. పుస్తక పఠనం అలవరుచుకోవాలన్నారు. పంచ తంత్ర కథల్లోని నీతిని గ్రహించుకోవాలన్నారు. మూడు చేపల కథను విద్యార్థులకు చదివి వినిపించారు. అనంతరం విద్యార్థులు క్యారమ్స్, క్రికెట్ క్రీడాలను సాధన చేశారు.

### సారా విక్రయిస్తే కేసులు నమోదు



నాటుసారా చూపుతున్న ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు, ఎస్ఐలు, పోలీసులు

నందికొట్కూరు: నాటుసారా విక్రయిస్తే కేసులు నమోదు చేయడం ఖాయమని ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు హెచ్చరించారు. బుధవారం నీలిషికారిపేటలో ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు చేశారు. నాటుసారా అమ్ముతున్న సజ్జాని అరెస్టు చేసి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. సీఐ మాట్లాడుతూ నాటుసారా అమ్ముతున్న వ్యక్తిని కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ ఆదేశించినట్టు చెప్పారు. ఎస్ఐ జగ్గర్ల తదితరులు ఉన్నారు.

# కొనేవారేరీ?

- ఆత్మకూరు మండలం కరివేన గ్రామానికి చెందిన రైతు మద్దిలేటి 70 ఎకరాల్లో పొగాకు పంట సాగుచేశాడు. అగ్రిమెంట్ ప్రకారం పొగాకును కంపెనీ యజమానులు కొనుగోలు చేయాల్సి ఉన్నా.. కేజీ పొగాకు కూడా కొనుగోలు చేయలేదు. దీంతో మద్దిలేటి దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు.
- కొత్త రామాపురం గ్రామానికి చెందిన రైతు గౌతమ్ 40 ఎకరాల్లో పొగాకు పంటను సాగుచేశాడు. ఒక్క కేజీ పొగాకు కూడా అమ్మకం విక్రయించలేదు.
- ఈ ఇద్దరు రైతులే కాదు.. ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు, వెలుగోడు మండలాల్లోని వందల మంది రైతులతో పొగాకు కంపెనీలు తాము దిగుబడులు కొనుగోలు చేస్తామని ఒప్పందం చేసుకుని పంట పండించిన తర్వాత ఎగ నామం పెట్టాయి.

- కొనుగోళ్లు నిలిపేసిన పొగాకు కంపెనీలు
- వందల ఎకరాల్లో మిగిలిపోయిన పొగాకు బేళ్లు
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- కేంద్రం జోక్యంతో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని అన్నదాతల డిమాండ్



నిల్వ ఉన్న పొగాకు బేళ్లు

ఆత్మకూరు: ఆత్మకూరు డివిజన్ పరిధిలో వేలాది ఎకరాల్లో రైతులు పొగాకును సాగు చేశారు. ప్రస్తుతం పంట కోతలు పూర్తయ్యాయి. పెద్ద ఎత్తున రైతులు పొగాకును బేళ్ల కట్టి నిల్వ చేశారు. ప్రతి రైతు ఏడాదికి ఒక పంట మాత్రమే సాగుచేయాలని, పంట కోత పూర్తయిన వెంటనే తాము దిగుబడులను కొనుగోలు చేస్తామని జీటీఎల్, అలయెన్స్ కంపెనీలు రైతులతో అగ్రిమెంట్లు తీసుకున్నాయి. దీంతోనే అన్నదాతలు ధైర్యంగా పొగును సాగు చేశారు. ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.లక్ష దాకా పెట్టుబడి పెట్టారు. తీరా పంట చేతికొచ్చిన తర్వాత కంపెనీలు మూసివేయడంతో పొగాకు కొనే నాథుడే లేకపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

**ప్రజాప్రతినిధులు సూచించినా కొనుగోలు చేయని కంపెనీలు**

ఆత్మకూరు, నందికొట్కూరు ప్రాంతాల్లో పొగాకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంత రైతులే గాకుండా నంద్యాల జిల్లాలో పలు ప్రాంతాల రైతులు సాగుచేసిన పొగాకును కొనగోలు చేసేందుకు గోదాములు ఏర్పాటు చేశారు. గోదాములు ఎక్కడ ఉంటే అక్కడికి పొగాకును తరలించి కొనుగోలు చేస్తున్నారు. అయితే పూర్తిస్థాయిలో కొనుగోళ్లు నిలిపివేయడంతో శ్రీశైలం, నందికొట్కూరు ఎమ్మెల్యేలతో పాటు నంద్యాల ఎంపీ సైతం పొగాకును కొనుగోలు చేయాలని కంపెనీలకు సూచించారు. అయినా వారు స్పందించడం లేదు.

**కేంద్ర ప్రభుత్వంపైనే ఆశ..**

పొగాకు రైతులు కేంద్ర ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. కనీసం మార్క్‌ఫెడ్ ద్వారా అయినా పొగాకును కొనుగోలు చేసి ఆదుకోవాలని వారు కోరుతున్నారు. రైతుల నుంచి క్వింటం పొగాకు రూ.15,500 చొప్పున కొనుగోలు చేస్తామని కంపెనీలు అగ్రిమెంట్ చేసుకున్నాయి. ప్రతిరైతుకు ఐడీ ఇచ్చి ఎన్ని ఎకరాల్లో పొగాకును సాగుచేస్తారు, పంట వచ్చిన వెంటనే తమకు విక్రయిస్తున్నారా లేదా అని కంపెనీలు ఆరా తీశాయి. చివరకు క్వింటం రూ.12 వేల నుంచి రూ.13 వేల వరకు కొనుగోలు చేశాయి. ఒప్పందం చేసుకున్న దానికన్నా తక్కువకు కొనుగోలు చేస్తున్నా రైతులు అంగీకరించారు. కాగా 25 శాతం మాత్రమే కొనుగోలు చేసి ఇప్పుడు కొనుగోళ్లు నిలిపేశారు. ఇంకా 75 శాతానికి పైగా పొగాకు దిగుబడులు అన్నదాతల వద్ద, గోదాములు, పొలాల్లో ఉన్నాయి. వర్షాలు, ఈదురుగాలులకు కొట్టుకుని పోకుండా టార్పాలిన్లు కప్పుతూ కాపాడుకునేందుకు రైతులు తీవ్ర తంటాలు పడుతున్నారు. మరోవైపు కంపెనీలు బెదిరింపులకు పాల్పడుతున్నాయి. పొగాకు కొనుగోలు చేయాలని గోదాముల వద్ద, రహదారులపై ఆందోళనకు దిగే రైతుల పేర్లు కనపడకుండా, ఐడీ నంబర్లను కంప్యూటర్ ద్వారా తొలగిస్తామని కంపెనీల యజమానులు హెచ్చరిస్తున్నట్లు సమాచారం.

**పొగాకు సాగు వివరాలు..**

| మండలం | ఎకరాలు |
|---|---|
| ఆత్మకూరు | 600 |
| కొత్తపల్లి | 600 |
| పాములపాడు | 700 |



పొలాల్లో తడవకుండా పొగాకు బేళ్లను కప్పిన దృశ్యాలు

**ఇంటి వద్దనే నిల్వ**



ఐదు ఎకరాల్లో పొగాకు సాగుచేశాను. ఆత్మకూరు సమీపంలోని కరివేన వద్ద రెండుసార్లు 40 బేళ్లను తీసుకెళ్లాను. బేళ్ల సరిగా లేవని వెనక్కి పంపారు. పొగాకును ఆరబెట్టి బేళ్ల కట్టి గోదాము వద్దకు తీసుకెళ్లాను. అక్కడ కూడా సరిగా లేదని వెనక్కి పంపారు. మళ్లీ పొగాకును ఆరబెట్టి తీసుకెళ్లాం. చివరకు పొగాకు కొనే పరిస్థితి కనిపించకపోవడంతో ఇంటి వద్ద నిల్వ ఉంచుకున్నాం. అధికారులు స్పందించి పొగాకును కొనుగోలు చేసేలా చూడాలి.

– హనుమంతరెడ్డి, సిద్ధపల్లి రైతు

**అగ్రిమెంట్ ప్రకారం కొనుగోలు చేయాలి**



పొగాకును సాగుచేయమని కంపెనీ నిర్వాహకులే వచ్చారు. పొగాకు క్వింటా రూ.15,500కు కొనుగోలు చేస్తామని అగ్రిమెంట్ చేసుకున్నారు. ఇప్పుడు కొనుగోలు చేయకుండా ఇబ్బంది పెట్టడం సరికాదు. లక్షల్లో పెట్టుబడి పెట్టాం. ఇప్పటికైనా కంపెనీల యజమానులు పొగాకు కొనుగోలు చేసి ఆదుకోవాలి.

– వెంకటేశ్వరనాయక్, ఎస్.ఎస్.తండా రైతు

### ఓంకారంలో ప్రత్యేక పూజలు



పూజలందుకున్న స్వామి వారు

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని గంగా ఉమా సమేత ఓంకారేశ్వరాలయానికి బుధవారం అక్షయ తృతీయ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పంచబుగ్గల కోనేరులో పుణ్య స్నానాలు ఆచరించి ఓంకారేశ్వర స్వామిని, అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. తర్వాత వ్యాస మహర్షి చేత ప్రతిష్ఠించబడిన ఆంజనేయ స్వామి విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. నల్లమల కొండపై ప్రతిష్ఠించిన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను కాలి నడకన వెళ్లి భక్తులు సందర్శించారు. భక్తులకు కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో అన్నదానం చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

### 4న ఆలయ వార్షికోత్సవం

ఆత్మకూరు: ఈనెల 4న స్థానిక సాయిబాబా ఆలయ వార్షికోత్సవం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. 4న ఉదయం 7.13 గంటలకు ఆలయంలో దత్తాత్రేయ, నందీశ్వర పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 8 గంటలకు మూలవిరాట్‌కు అష్టోత్తర కలశాభిషేకం, మధ్యాహ్నం పూర్ణాహుతి, కలశ జల సంప్రోక్షణ, రాత్రి 7.30 గంటలకు ప్రాకారోత్సవం ఉంటుందన్నారు. ఈనెల 2, 3 తేదీల్లో ఆలయంలో శ్రీశ్రీశ్రీ జగద్గురు ఆదిశంకరాచార్యుల వారి పూజ, యాగ శాల ప్రవేశం, నవగ్రహ వాస్తు, కలశ స్థాపన ఉంటుందున్నారు. భక్తులు పాల్గొని సాయిబాబా కృపకు పాత్రులు కావాలన్నారు.

### నేటి నుంచి పింఛన్ల పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ గురువారం నుంచి చేపట్టనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 2,14,058 మంది పింఛన్ దారులకు రూ.92.02 కోట్లు మంజూరు అయినట్లు తెలిపారు.

## గృహ నిర్మాణాలు పూర్తి చేయండి



చెలిమిళ్లలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి రాజు

పాములపాడు: గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి రాజు సూచించారు. బుధవారం బానక చర్ల, చెలిమిళ్ల, జూటూరు, పాములపాడు గ్రామాల్లోని జగనన్న కాలనీలో పర్యటించారు. వివిధ స్థాయిల్లో నిలిచిపోయిన గృహ నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని లబ్ధిదారులతో మాట్లాడుతూ ఆర్‌సీ, ఆర్‌ఎల్ స్థాయిల్లో నిలిచిన గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. బిల్లులు వెంటనే చెల్లించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏఈ హౌసింగ్ శ్రీనివాసులు ఉన్నారు.

**సచివాలయాల తనిఖీ**

మండలంలోని చెలిమిళ్ల, బానకచర్ల గ్రామాల్లో గ్రామ సచివాలయాలను మండల ప్రత్యేక అధికారి రాజు తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. సమయవేళలు పాటించాలని సూచించారు. సర్వేల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని, త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

## వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి




నిరసన తెలియజేస్తున్న ముస్లింలు

వెలుగోడు: వక్ఫ్ బోర్డ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని మైనారిటీ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ మౌలానా జావాద్ అహ్మద్, సీపీఎం నాయకులు రాజశేఖర్ డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలనే డిమాండ్‌తో బుధవారం వెలుగోడులో చేపట్టిన ర్యాలీ విజయవంతమైంది. ముందుగా పహల్గామ్ టెర్రరిస్టుల దాడిలో మృతిచెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం ర్యాలీగా పాత బస్టాండ్ మర్కస్ మసీదు నుంచి మదిన సెంటర్‌కు చేరుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మైనారిటీల హక్కులను అణిచివేయాలని చూస్తోందన్నారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దుచేసి ముస్లింల హక్కులను రక్షించాలన్నారు. పహల్గామ్ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి బహిరంగంగా ఉరి తీయాలన్నారు. దేశ భద్రత కోసం దేశం కోసం ఎటువంటి త్యాగానికైనా సిద్ధమన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం చేరుకుని తహసీల్దార్ శ్రీనివాసులకు వినతి పత్రం సమర్పించారు. ర్యాలీ సందర్భంగా ఆత్మకూరు సీఐ సురేష్‌కుమార్ రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎం అబ్దుల్ కలాం, కో కన్వీనర్‌లు మౌలానా మహబూబ్ రహిమాన్, హిదాయత్ అలీఖాన్, మోమిన్ రసూల్, డాక్టర్ జాకీర్ హుస్సేన్, ఇలియాస్ ఖాన్, రఫీ, సాబిర్ హుసేన్, వలీ, టైలర్ సయ్యద్, మొహమ్మద్ ఖాన్, లాయర్ సిద్ధిక్ పాల్గొన్నారు.



వెలుగోడులో నిర్వహించిన ర్యాలీలో భారీగా పాల్గొన్న ముస్లింలు

## సత్ప్రవర్తనతో మెలగాలి

ఆళ్లగడ్డ: క్షణికావేశంలో నేరాలకు పాల్పడి శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు విడుదలయ్యాక సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ లీలా వెంకట శేషాద్రి అన్నారు. స్థానిక ఉప కారాగారంలోని న్యాయ సహాయ కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కారాగారంలో ఉన్న ఖైదీలతో ఏ ఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారు. ఎప్పటి నుంచి రిమాండ్‌లో ఉంటున్నారు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదులు ఉన్నారా అని ఆరా తీశారు. అలాగే జైలులో కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. ఆర్థిక స్తోమత లేని రిమాండ్ ఖైదీలకు దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా న్యాయ సహాయం అందజేస్తామన్నారు.



ఉప కారాగారంలో ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శేషాద్రి

**మానసిక ఆరోగ్య విభాగం తనిఖీ**

నంద్యాల(వ్యవసాయం): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి బి.లీలా వెంకట శేషాద్రి, లీగల్ సర్వీస్ యూనిట్ ఫర్ మానోనియ కమిటీ సభ్యులు న్యాయవాది శేషసాయి బాబు, జీవన్ కుమార్, పారా లీగల్ వలంటీర్‌లు బుధవారం శాంతిరామ్ జనరల్ ఆసుపత్రిలోని మానసిక వికలాంగుల విభాగాన్ని తనిఖీ చేశారు.

### వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వం విఫలం

బండిఆత్మకూరు: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ప్రజలు వాపోతున్నారు. నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను నియమించింది. వారు నాలుగు వారాలుగా తమకు ఉద్యోగ భద్రత కల్పించి, జీతాలు పెంచాలని విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్నారు. ఈక్రమంలో గ్రామాల్లో వైద్య సేవలు స్తంభించిపోయాయి. వృద్ధులు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించి వారి సేవలను ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

### అల్లూరులో విగ్రహ ప్రతిష్ట వేడుకలు

నందికొట్కూరు: మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో బుధవారం విగ్రహ ప్రతిష్ట వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి పాల్గొని వరసిద్ది వినాయక సుంకులా పరమేశ్వరి దేవి, ఎల్లమ్మ, సవారమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 10.4 గంటలకు ఆలయాల ప్రతిష్ట మహోత్సవాన్ని పురోహితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ప్రాతకాల పూజలు, హోమం యంత్ర, విగ్రహ అభిషేకాలు చేశారు.

### కౌలు గుర్తింపు కార్డులు తప్పనిసరి

ఆత్మకూరు: మండలంలోని కౌలు రైతులు కౌలు గుర్తింపు కార్డులు పొందాలని ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు గ్రామ రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వాటిని సిబ్బంది పరిశీలించి కౌలు గుర్తింపుకార్డులు అందించేందుకు కృషి చేస్తారన్నారు.

### అనుమతులున్న ఎరువులనే విక్రయించాలి

కొత్తపల్లి: ప్రభుత్వ అనుమతులున్న ఎరువులు, మందులు, విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు బి.ఆంజనేయ ఫర్టిలైజర్ దుకాణదారులకు సూచించారు. బుధవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండలంలోని విత్తన, పురుగు మందులు, ఎరువుల డీలర్లతో సమావేశమయ్యారు. ఏడీఏ ఆంజనేయ మాట్లాడుతూ అనుమతులు లేని ఎరువులు, మందులు, విత్తనాలను విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రతి డీలరు బిల్లు, స్టాక్, రిజిస్టర్ల నిర్వహణ తప్పులు లేకుండా నిర్వహించాలన్నారు. విత్తనాల రాక గురించి ఎప్పటి కప్పుడు అధికారులకు, రైతులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ నాగశ్రీ, ఎంపీఈఓ వాజిద్, డీలర్లు పాల్గొన్నారు.

### ఎండుతున్న పంటలు

- ఆందోళనలో రైతులు

మహానంది: పంటలు ఎండిపోతున్నాయని వెంగళరెడ్డిపేటకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిమ్మాపురం సబ్ స్టేషన్ పరిధిలోని అబ్బీపురం ఫీడర్ కింద వెంగళరెడ్డిపేట రైతుల పొలాలు వందల ఎకరాలు ఉన్నాయి. విద్యుత్ శాఖ అధికారులు వేళలకు విద్యుత్ సరఫరా ఇవ్వకపోగా పొంతన లేని సమాధానం ఇస్తుండటంతో పంటలకు నీళ్లు పెట్టుకోలేకపోతున్నామని వాపోతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందిని సరఫరా గురించి అడిగితే గ్రామంలో సబ్ స్టేషన్ పెట్టుకోండంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నిర్ణీత వేళలకు సరఫరా ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ జాతర



గ్రామంలో కొలువు తీరిన పెద్దమ్మ తల్లి



అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

మహానంది: పెద్దమ్మ జాతర సందర్భంగా అబ్బీపురం గ్రామం బుధవారం కిటకిటలాడింది. వేలాది మంది తరలిరావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామస్తుల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దమ్మ తల్లి అమ్మవారి విగ్రహం భక్తులను ఆకట్టుకుంది. గ్రామస్తులు ప్రతి ఇంటి నుంచి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు తీసుకెళ్లి సమర్పించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఒక దశలో గ్రామంలో ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నెల్లూరు, పలు ప్రాంతాలకు చెందిన కళాకారులు జిల్లా పరిషత్ పాఠశాల వద్ద ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకున్నాయి.

### తప్పిన ప్రమాదం



నేల కొరిగిన భారీ వేప వృక్షం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో స్థానిక బయటిపేట ఆంజనేయ స్వామి దేవస్థానంలో వందల ఏళ్ల నాటి భారీ వేప చెట్టు బుధవారం తెల్లవారుజామున కూలిపోయింది. అయితే, ఆసమయంలో చెట్టు కింద భక్తులెవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదు. కూలిపోయే సమయంలో ఎలాంటి గాలి వాన లేదని, ఉన్నట్టుండి ఆలయ ప్రాకారంపై పడిపోయిందని ఆలయ అర్చకులు, వాచ్‌మెన్లు తెలిపారు. చెట్టు కూలిన విషయాన్ని తహసీల్దార్, ఎండోమెంట్ అధికారులకు ఈఓ వేణునాథరెడ్డి సమాచారం అందించారు.

## పుచ్చ...ఆరోగ్యానికి రక్ష

- వేసవి తాపం నుంచి పుచ్చకాయలతో ఉపశమనం పొందుతున్న ప్రజలు




నందికొట్కూరు: మే నెలలో ఎండలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ చల్లదనాన్ని కోరుకుంటారు. ఎండల్లో ప్రయాణించే వారు దాహార్తిని తీర్చుకునే ప్రయత్నం చేస్తుంటారు. మండుటెండలో ఓ పుచ్చకాయ ముక్క తింటే దాహార్తికి అడ్డుకట్ట వేయవచ్చు. రుచికి రుచి...చల్లదనానికి చల్లదనం ఇచ్చే పుచ్చకాయ అంటే చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ అందరికీ నోరూరుతుంది. పుచ్చకాయ అంటే ఇష్టపడని వారుండరు. పెరుగుతున్న ఎండలతో పుచ్చకాయ అమ్మకాలు ఊపందుకున్నాయి. ప్రస్తుతం రహదారుల వెంట తాత్కాలికంగా పుచ్చకాయ దుకాణాలను వ్యాపారులు ఏర్పాటు చేసుకుంటున్నారు.

**పోషకాలు పుష్కలం**

పుచ్చకాయలో బీ విటమిన్, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఎలక్ట్రోలైట్లు సమృద్ధిగా లభిస్తాయి. పుచ్చకాయలో కొలెస్ట్రాల్ ఉండవు. పుచ్చకాయ తింటే తక్షణ శక్తితో పాటు శరీరానికి ఎంతో మేలు చేకూరుతుంది. పుచ్చకాయలో 92 శాతం అల్కలైన్, నీళ్లతో పాటు పీచ్ పదార్థం ఉండటం వల్ల శరీరానికి, మూత్రపిండాలకు, మూత్రనాళాలకు ఎంతో ఉపయోగకరం. పుచ్చకాయ తినడం వలన మల బద్ధకం తగ్గుతుంది. ఇందులో ఉండే బీటాకెరోటిన్ రోగనిరోధక శక్తిని పెంచుతుంది. వృద్ధాప్యంలో వచ్చే అంధత్వ సమస్యను నివారిస్తుంది. కిడ్నీలో రాళ్లు ఉన్న వారికి కూడా ఉపయోగకరం. ఆస్తమా, మధుమేహం, ఆర్థరైటిస్ సమస్యలకు బాగా పని చేయడంతో పాటు సక్రమంగా రక్తప్రసరణ జరిగేలా చేస్తుంది. అంతేకాకుండా పుచ్చకాయ సౌందర్యానికి కూడా ఉపకరిస్తుంది.

**ఆరోగ్యానికి మంచిది**



పుచ్చకాయలో 82 శాతం నీరు ఉండటంతో శరీరానికి కావాల్సిన చల్లదనాన్ని ఇస్తుంది. పుచ్చకాయలో పోషకాలు కూడా ఎక్కువగా ఉంటాయి. చిన్న పిల్లలు ఎక్కువగా తింటే జ్ఞాపక శక్తి పెరుగుతుంది. పుచ్చకాయ తింటే రక్తపోటు కూడా తగ్గుతుంది. పుచ్చకాయలో ఉండే మెగ్నీషియం, పొటాషియం గుండె ఆరోగ్యానికి తోడ్పడతాయి. వేసవిలో పుచ్చకాయ తినడం ఆరోగ్యానికి మంచిది.

– డాక్టర్ రాంబాబు, నందికొట్కూరు